క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను కామర్స్ విభాగంలో ఓ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) మార్కులు ఉన్నవారు అర్హులని, పీహెచ్‌డీ, నీట్, ఎస్ఎల్ఈటీ, సెట్‌తో పాటు బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భద్రాచలంలో ఈ నెల 4వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు అందించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కొత్తగూడెంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

రేపు సన్నాహక సమావేశం

కరకగూడెం: మండల కేంద్రంలోని స్పందన గార్డెన్స్‌లో రేపు (గురువారం) ఉదయం 10 గంటలకు కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి మండలాల బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10, 11 తేదీల్లో జిల్లాలో కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థులను ఖరారు చేయనున్నామని, ఆశావాహులు తమ పూర్తి బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

ఆర్థిక సాయం

కరకగూడెం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నిరుపేద సుశీల అనారోగ్య సమస్యలతో కొద్దిరోజుల క్రితం మృతి చెందగా.. మంగళవారం కుటుంబ సభ్యులకు దాతలు క్వింటా 25 కేజీల బియ్యం, నూనె, నిత్యావసరాలను అందజేశారు. అదనంగా మండల రెవెన్యూ భూభారతి ఆపరేటర్ చందా కౌసల్య రూ.6,500 రూపాయలు అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు పోలేబోయిన వెంకట నారాయణ, మాజీ సర్పంచులు పాయం నర్సింహారావు, పోలేబోయిన పాపక్క, జేఏసీ ప్రధాన కార్యదర్శి కలం సాంబమూర్తి, పోలేబోయిన సర్వేశ్వరావు, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పోలేబోయిన ప్రేమ్ కుమార్, కలం సంపత్, ఉకే నరేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటుదాం



సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

మణుగూరుటౌన్: జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐను గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కిన్నెర కల్యాణ మండపంలో సరెడ్డిపుల్లారెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కార్మికులు, పేదల పక్షాన పోరాటాలు చేస్తూ వచ్చిన సీపీఐ సత్తా ఏంటో ఎన్నికల్లో చూపించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ మంగళవారం భద్రాచలం చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతకు సందేశాలతో కూడిన కరపత్రాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

వ్యాధులను అరికట్టాలి

గుండాల: సీజనల్ వ్యాధులను అరికట్టాలని, ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్శక రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు పీవైఎల్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీవైఎల్ మండల అధ్యక్షుడు తాటి రమేష్, గుండాల మాజీ ఉపసర్పంచ్ మానాల ఉపేందర్, పూనెం అనిల్, అరెం రామారావు, కల్తీ ప్రభాకర్, సుధాకర్, పోతయ్య, కోటేష్ పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాలను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మంగళవారం నిరసన చేపట్టి, మాట్లాడారు. సంపత్, చందర్‌రావు, కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



అశ్వారావుపేటరూరల్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



భద్రాచలంటౌన్: వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని మంగళవారం పలుచోట్ల నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలవేసి ఘనంగా నివాళులర్పించారు. రోగులకు పాలు, పండ్లు అందించారు. ఆయన పాలనను, సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రైతులు



మణుగూరుటౌన్: వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అన్నపురెడ్డిపల్లి: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



భద్రాచలంటౌన్: ఎమ్మెల్యే తెల్లం ఆధ్వర్యంలో..



దుమ్ముగూడెం: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



దమ్మపేట: మొద్దులగూడెంలో పూలమాల వేస్తూ..



అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..



చర్ల: నాయకుల నివాళులు..



ములకలపల్లి: జగన్నాథపురంలో..



పినపాక: బయ్యారం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అభిమానులు

పాఠశాలల్లో క్రీడలు ప్రారంభం



దమ్మపేట: బాలికలతో కబడ్డీ ఆడుతున్న ఎంఈఓ కీసర లక్ష్మి

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలికలకు క్రీడా పోటీలను ఎంఈఓ కీసర లక్ష్మి మంగళవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంఈఓ బాలికలతో కలసి కాసేపు సరదాగా కబడ్డీ ఆటను ఆడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి, గురుకుల ప్రిన్సిపాల్ వీరాస్వామి, హెచ్ఎంలు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక గుడ్ న్యూస్ స్కూల్ ఆవరణలో పోటీలు నిర్వహించగా.. తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ జాతీయ జెండాను ఎగుర వేసి, ప్రారంభించారు. స్థానిక ఎంఈఓ ప్రసాదరావు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పి.హరిత, నల్లపు కొండలరావు, సీఆర్పీలు ప్రభాకరాచారి, మల్లేష్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల పరిధిలోని చిరుమళ్ల ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ కుమార్, ఎంఈఓ మంజుల ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం రామచంద్రయ్య ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ బాలరాజు, ప్రమీల పలు పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ప్రారంభమైన మండల స్థాయి క్రీడోత్సవాలకు ఎంఈఓ టి.రమ ముఖ్య అతిగా పాల్గొని మాట్లాడారు. పద్మజ, శ్రీనివాసరావు, రాజా శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, హన్సి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల్లో యాజమాన్య పద్ధతులు

బూర్గంపాడు: అధిక వర్షాల నేపథ్యాన వరి, పత్తి పంటలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కొత్తగూడెం కేవీకే శాస్త్రవేత్తలు శివ, హరిచంద్ర సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఏడీఏ తాతారావుతో కలిసి పంటలను పరిశీలించి మాట్లాడారు. చేన్లలో నీటిని బయటకు పంపించి, పోషక లోపాల నివారణకు జింక్, పొటాష్, నానో యూరియా, 19:19:19, నానో డీఏపీ పిచికారీ చేయాలన్నారు. అలాగే, బ్యాక్టీరియా, ఎండుతెగులు, కాండం తొలుచు పురుగులు, అగ్గితెగులు నివారణకు నివారణపై అవగాహన కల్పించారు. ఏఈఓలు శృతి, నాగవైష్ణవి, పవన్ పాల్గొన్నారు.

వరికి చీడపీడలపై జాగ్రత్త

అశ్వాపురం: మండలంలో ఇటీవల నెలకొన్న వాతావరణ పరిస్థితుల వల్ల వరిపంటలో పోషక లోపాలు, చీడపీడలు వచ్చే అవకాశం ఉందని.. ఈ మేరకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మండల పరిధిలోని మల్లెలమడుగులో వ్యవసాయ అధికారులతో కలిసి శాస్త్రవేత్తలు వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీఏ తాతారావు, శాస్త్రవేత్తలు శివ, హరిచంద్ర, ఏఈఓ రమాదేవి పాల్గొన్నారు.



అశ్వాపురం: వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

నిష్పక్షపాతంగా సర్వే చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబురావు

మణుగూరుటౌన్: ఓసీ విస్తరణలో భూములు కోల్పోతున్న తిర్లాపురం, రామానుజవరం పంచాయతీల్లో ఎంజాయిమెంట్ సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించాలని, నిర్వాసితులకు చట్టం ప్రకారం ప్యాకేజీ అందించాలని భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక శ్రామిక భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు సార్లు భూములు కోల్పోయిన వారికి ఎకరాకు రూ.50 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని, రాజుపేటను నిర్వాసిత గ్రామంగా ప్రకటించి ప్యాకేజీ అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, నేతలు మచ్చ వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, నిమ్మల వెంకన్న, గద్దల శ్రీనివాసరావు, సత్రపల్లి సాంబశివరావు, దుబ్బగోవర్ధన్, కొమరం కాంతారావు, పాయం నర్సింహారావు, నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, బండారు సారిక, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సీబీఐ విచారణ తగదు

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ.. మండల కేంద్రాలు, గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రహదారులపై బైఠాయించి నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసేందుకు యత్నిస్తోందని, ఈ మేరకు కేసీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా, నాయకుల నిరసన..



మణుగూరురూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో

ఘనంగా బోటనీ ఎగ్జిబిషన్

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బోటనీ ఎగ్జిబిషన్ కార్యక్రమం ఘనంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మహాత్మా జ్యోతి రావ్ పూలే గురుకుల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సందర్శించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థుల్లోని ఆలోచన విధానాన్ని మెచ్చుకొని బహుమతి ప్రదానం చేసినట్లు వెల్లడించారు.

వైఎస్సార్ గుర్తొచ్చారు..



బాలుడి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డా.రాజశేఖర్ రెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడు రాజశేఖర్‌రెడ్డి చిన్నారులకు అందిస్తున్న వైద్యం, మాట్లాడుతున్న తీరు ఓ వ్యక్తికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వ్యక్తిత్వాన్ని గుర్తు చేశాయి. అనారోగ్యంతో మూడు రోజుల క్రితం ఓ బాలుడిని ఆయన తాత భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఈ బాలుడికి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి వైద్యం అందించి, నయం చేసి ఇక ఇంటికి వెళ్లొచ్చని భరోసా నిచ్చారు. ఈ సందర్భంగా బాలుడి తాత స్పందిస్తూ.. ఈ మూడు రోజులు అందించిన వైద్యం, మాట తీరు చూస్తుంటే దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుర్తొచ్చారంటూ కితాబిచ్చారు.

ఆటో బోల్తా, పలువురికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పిన ఓ ఆటో బోల్తా పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం చంద్రుగొండ మండలానికి వస్తున్న నేపథ్యాన ఐకేపీ అధికారులు గ్రామ దీపికలతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎనిమిది మంది గ్రామదీపికలు ఆటోలో వెళ్తుండగా తిమ్మాపురం వద్ద ఎదురుగా వచ్చిన మరో వాహనాన్ని తప్పించే క్రమాన అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

గుండాల: విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆళ్లపల్లి మండలంలోని తిర్లాపురం గ్రామానికి చెందిన ఊకె శ్రీనివాస్‌కు చెందిన ఒక గేదె, ఒక దూడ, పూనెం గౌతమ్‌కు చెందిన ఒక గేదె మంగళవారం మేతకు వెళ్లాయి. పొలాలకు వెళ్లే విద్యుత్ తీగలు తెగి పడడంతో వాటిని తాకిన గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. విద్యుత్ అధికారులు తమకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.

కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు

గుండాల: పిచ్చికుక్కల స్వైర విహారంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఆళ్లపల్లి మండలం అనంతోగులో మంగళవారం కుక్కలు దాడి చేయగా మోకాళ్ల సురేష్, కుంజ రవితేజ, జనార్దన్, స్వామి, శర్వానంద్, సాయికిరణ్ గాయపడ్డారు. వీరు ఆళ్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గోదావరి నదిలో వినాయక నిమజ్జనాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పూర్తిస్థాయిలో తాకిడి లేకపోవడంతో విగ్రహాలను లాంచీల ద్వారా గోదావరి లోనకు తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు 167 విగ్రహాలు నిమజ్జనం కాగా, మంగళవారం రాత్రి 7 గంటల వరకు 244 విగ్రహాలను నిమజ్జనం చేశారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేతలు?

కరకగూడెం: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బుధవారం తెలంగాణ భవన్‌లో జిల్లా స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పినపాక నియోజకవర్గంలోని పలు మండలాల మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన జరుగుతుండటంతో.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ చేరికలు చర్చనీయాంశంగా మారాయి.

పాఠశాల మొదటి వార్షికోత్సవం

దుమ్ముగూడెం: మండల కేంద్రంలోని లక్ష్మీనగరం గ్రామంలో మూతబడిన సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాలను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలగా పునఃప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. గ్రామ యువత విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఉపాధ్యాయుడు బొడ్డు నాగేశ్వరరావు, హైమావతి, గ్రామపెద్దలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

కరకగూడెం: మండలంలోని గౌడ కులస్తులు మంగళవారం మండల కేంద్రంలో సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. మొత్తం 12 మందితో కూడిన కమిటీలో అధ్యక్షుడిగా కరకగూడెం గ్రామానికి చెందిన ముంజాల సాయిబాబా, ఉపాధ్యక్షుడిగా కొనగండ్ల సాయి కిరణ్, జనరల్ సెక్రటరీగా బొంగోని గణేష్‌తో పాటు మరికొందరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట గ్రామంలోని జీడిగింజల గోదాం సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ వైరా వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతులమీదుగా మంగళవారం ప్రారంభించారు. మండలం నుంచి 80 మంది కంటి పరీక్షలు చేయించుకోగా.. ఆపరేషన్ అవసరమైన వారిని వైరాకు పంపనున్నట్లుగా బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో అంకత మహేశ్వరరావు, దారా యుగంధర్, రాచూరి వేణు, పసుమర్తి రామభద్రం తదితరులు పాల్గొన్నారు.

యూడైస్‌లో నమోదు కావాలి

అశ్వారావుపేటరూరల్: ప్రైవేటు పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థీ యూడైస్‌లో నమోదు కావాలని ఎంఈఓ పొన్నగంటి ప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. హాజరు రికార్డులో ఉన్న విద్యార్థుల వివరాలను యూడైస్‌లో ఉండే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాల బాధ్యులు కొత్తారు చలపతిరావు, ఇనుగంటి ప్రవీణ్, ధన్‌రాజ్, కల్యాణి, సీఆర్పీ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

